విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 15, ఫిబ్రవరి 2024

రైతులు, కార్మికులపై విషం చిమ్ముతున్న కర్కోటకుడు ప్రధాని మోదీ

- రైతు కంటతడి పెడితే దేశానికి అన్నం పెట్టే దిక్కుండదు ..
- కార్మికుల కష్టాన్ని కార్పొరేట్లకు అమ్ముకుంటున్న బీజేపీ ప్రభుత్వం ...
- బీజేపీ మెడలు వంచుదాం
- 16న గ్రామీణ బంద్ విజయవంతం చేద్దాం
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కార్యవర్గ సభ్యుడు రాజా రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: రైతులు కార్మికుల పొట్టకొడుతూ వారి కష్టాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి గుణపాఠం నేర్పాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కార్యదర్శి వర్గ సభ్యుడు రాజారెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రజా సంఘాల నాయకులు బుధవారం మరోసారి సమావేశ మయ్యారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షత వహించగా జాఫర్ సహా రాజారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు కార్మికులు తమకు జరిగిన అన్యాయంపై పాలక ప్రభుత్వాలను ప్రశ్నిస్తుంటే వారిపై భద్రతా దళాలను రెచ్చగొట్టి అమానుష దాడులకు పాల్పడడం పాలు చూపించి విషం చిమ్మిన చందంగా ఉందన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి బయల్దేరిన బాధితులను సరిహద్దుల్లోనే నిలిపి హింసాకాండను ప్రేరేపించడం బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనమని విరుచుకుపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను కాపాడాల్సిన రక్షక భటులు పాలకుల తాయిలాలకు తలొగ్గి భక్షక భటులుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సంవత్సరం పాటు జరిగిన నల్ల చట్టాల ఉద్యమమే ఇందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఆనాటి రైతు ఉద్యమం ప్రధాని మోదీ గుర్తు చేసుకోవాలని సూచించారు. దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పరిశ్రమలు, గనులు, విద్యుత్, ఆటవి సంపద, రవాణా, బ్యాంకులు,ఎల్ఐసి తదితర ఆదాయ వనరులు అంబానీ అదానీలకు కట్టబెట్టే విధానాల వల్ల ఆదానీ అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారని పేద రైతులు,కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు 1 లక్షా 50 వేల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని బిజెపి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు.ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసి ప్రత్యేక హెూదాను నిరాకరించిన మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ అన్ని పంటలకు మద్దతు ధర, రైతురుణ మాఫీ, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉపాధి హామీ పథకం కి కేంద్ర బడ్జెట్లో 2 లక్షల కోట్ల కేటాయించి 2 వందల పనిదినాలతోపాటు రోజు వారీ వేతనం 600 ఇవ్వాలని, ఆహార భద్రత చట్టం తీసుకు రావాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు స్వస్తి పలికి కడప ఉక్కుపరిశ్రమను నిర్మించి ఆదుకోవాలన్నారు. అన్న దాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు భరోసానిచ్చే చట్టం అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయ వంతం చేయాలని పరిశ్రమలన్నింటిలో కార్మిక సమ్మె జరిగేలా అన్ని రైతు, కార్మిక సంఘాల, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినియోగదారుల సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళ, సాంస్కృతిక సంఘాలు గ్రామీణ బందును పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు లింగ మయ్య, కేశవరెడ్డి, నారాయణ స్వామి, రంగయ్య, రామకృష్ణ, రాజేష్ గౌడ్, నాగరాజు, మల్లికా ర్జున, రామాంజనేయులు, మల్లికార్జున, రైతు సంఘం జిల్లా అధ్య క్షుడు చెన్నప్ప యాదవ్, ఏటియుసి నగర కార్యదర్శి కృష్ణుడు, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య, ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్,కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ,ప్రజా సంఘాల నాయకులు బండి రామకృష్ణ, నాగప్ప, కృష్ణానాయక్, వెంకటరాముడు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళమిచ్చిన ఎమ్మెల్యే కాపు..

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండలంలోని కల్యం గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి 34 రథోత్సవ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి, కాపు ప్రవీణ్ రెడ్డి కల్యం గ్రామానికి చేరుకుని ఆంజనేయ స్వామి పూజలు నిర్వహిం చారు. 34వ రథోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి మూడు రోజులకు సరిపడా నగ దును గ్రామ పెద్దలకు అందజేశారు.

ఆలయ ప్రహరీకి విరాళం

విశాలాంధ్ర–రాయదుర్గం రూరల్: స్థానిక పసన్న వెంకటేశ్వర దేవాలయ ప్రహరీ గోడ, పుష్క రిణి నిర్మాణానికి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బుధవారం భూమి పూజ నిర్వహించారు. రూ.4..15 కోట్లు, టీడీపీ మంజూరు చేసిన రూ.1.20 కోట్లతో నిర్మాణం ప్రారంభించామన్నారు.

పోలీసు నోటీసులపై..కాలవ ఆగ్రహం

విశాలాంధ్ర–రాయదుర్గం రూరల్: నియోజకవర్గంలో ప్రభుత్వ కార్య క్రమాల నిర్వహణలో నిబంధనలు పాటించకుండా, వెలుగు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. గుమ్మగట్టలో జరిగే ఆసరా కార్యక్రమంలో తనను పాల్గొనరాదంటూ, బుధవారం ఉదయం పోలీసులు నోటీసు ఇవ్వడాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా తప్పుపట్టారు. ఆసరా కార్యక్రమంలో మహిళా సంఘాలకు మెట్టు గోవిందరెడ్డి చెక్కులు ఎలా పంపిణీ చేస్తాడని ప్రశ్నించారు. ఎటువంటి ప్రోటోకాల్ లేని మెట్టు గోవిందరెడ్డిని ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలా ఆహ్వానిస్తారని నిలదీశారు. ఇటీవలే ప్రభుత్వం అయన్ను ఏ.పి.ఐ.ఐ.సి చైర్మన్ పదవి నుండి తొలగించిందని గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మెట్టు గోవిందరేడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో అతిథిగా ఎలా పాల్గొంటున్నాడో సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికార పార్టీకి రాజకీయ ప్రయోజ నాలు కలిగించే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిం చారు. 2004-09 మధ్యకాలంలో మెట్టు ఎమ్మెల్యేగా ఉంటే, తాను 2014-19 ఎమ్మెల్యేగా ఉన్నానని తనని ఎందుకు ప్రభుత్వ కార్యక్రమా లకు పిలవడం లేదని వెలుగు అధికారులను వివరణ కోరానని స్పష్టం చేశారు. ఆహ్వానం అందించికపోగా తనకు పోలీసులు నోటీసులు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలకు ఒక గౌరవం, ప్రతిపక్షంలో ఉన్న వారిని మరోలా చూడడం సబబు కాదన్నారు. కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘన తీరును నిశితంగా గమనించి, సంబంధింత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం మొండిగా వెళితే ఉద్యమం ఉధృతం

విశాలాంధ్ర– రాప్తాడు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వెళ్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉద్యోగ జేఏసీ నాయకులు వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాప్తాడు మండల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల అవలంభిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ఎపి ఎన్జీవో నగర కార్యదర్శి పి.శ్రీధర్ బాబు అధ్వర్యంలో రాప్తాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ టి. సీతారాంకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం ఐఆర్,11 వ పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డి.ఏ.లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు రాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ ..

విశాలాంధ్ర–అనంతపురం రూరల్: చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారనే ఆవేదనతో మృతి చెందిన వారి కుటుంబా లను నారా భువనేశ్వరి బుధ వారం పరామర్శించారు. కనగానపల్లి మండలం వేపకుంట గ్రామంలో సీనియర్ టీడీపీ కార్యకర్త బెస్త నారాయణ, రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి వెంకట్ రాముడు గత ఏడాది గుండెపోటుతో మృతిచెందారు. నిజం గెలవాలి అనే నినాదంతో వేపకుంట, పోలేపల్లి గ్రామా లకు వెళ్లి బెస్త నారాయణ, వెంకటరాముడు చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భువనే శ్వరి వెంట మాజీ మంత్రి పరిటాల సునీ తమ్మ, ధర్మవరం ఇంచార్జి పరిటాల శ్రీరా మ్, హిందూ పురం పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య మాజీ జెడ్పిటిసి రామ్మూర్తి నాయుడు, నెట్టెం వెంకటేష్, కన్వీనర్లు యాతం పోతలయ్య, సుధాకర్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీధర్ నాయుడు, మారుతి ప్రసాద్ ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యుత్ లైన్‌మన్ మృతి

విశాలాంధ్ర–బొమ్మనహాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లైన్మెన్ విజయ్‌కుమార్ (45) చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల మేరకు రాయదుర్గం మండలంలో నాగిరెడ్డిపల్లి గ్రామానికి విద్యుత్తు లైన్ మాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బొమ్మనహాల్‌లో నివాసం ఉంటు విధులకు హాజర య్యేవారు. ఈనెల 3న విధులు నిర్వహించుకొని సాయంత్రం బొమ్మనహాల్‌కు వస్తుండగా ఉద్దేహాల్ వద్ద ద్విచక్ర వాహనం నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

ఈనెల 16న గ్రామీణ బంద్ జయప్రదం చేద్దాం..

విశాలాంధ్ర–రాప్తాడు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహించాలని పరిశ్రమలన్నింటిలో కార్మిక సమ్మె జరపాలని అన్ని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు నిర్ణయించిన నేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గంలో కూడా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పి. రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం రాప్తాడులో సిపిఐ మండల కార్యదర్శి ఆర్. రవీంద్ర ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సీ2ం50% ప్రకారం మద్దతు ధరల చట్టం అమలు చేయాలన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని కేరళ తరహాలో రుణఉపశమన చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి 200 రోజులకు కూలి దినాలు పెంచి రోజు కూలీ రూ.600వేతనం, రెండు పూటల పని, ఆన్లైన్ మస్టర్ రద్దు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల, కడప ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరిం చాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును విరమించు కోవాలన్నారు. భూ హక్కుల చట్టం 27/23 ఉపసంహరించాలని, చుక్కల భూము లు బంజర భూములు అన్నింటికీ పట్టాలు ఇవ్వాలనిఇ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు నిర్వాసితులకు పూర్తి పునరా వాసం, నష్టపరిహారం ఇవ్వాలని, బంజరు భూములకు కూడా చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం. చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరాముడు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, ఏఐటీయూసీ దుర్గాప్రసాద్, రైతు సంఘం నాయకులు నగేష్ ,నరేంద్ర, చిన్న వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

బయటపడిన 30 మంది విద్యార్థులు

విశాలాంధ్ర–ఉరవకొండ: మండలం పెన్నానుపల్లి వద్ద ఏ.వి.ఆర్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సుకు పెను ప్రమాదం తప్పింది. వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం నుండి ఉరవకొండ వైపు వెళ్తున్న బస్సు స్టీరింగ్ రాడు విరిగిపోవడంతో పక్కకు వెళ్లి ఓవైపుకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వారంతా క్షేమంగా ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్టు తెలుస్తోంది. హుటాహుటిన పాఠశాల యాజమాన్యం మరో బస్సును తీసుకువచ్చి విద్యార్థులను పాఠశాలకు తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని బస్సులు పూర్తిస్థాయిలో పరీక్షించి నడపాలని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాల్లో వసతులు కల్పించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో తాడిపత్రిలో ధర్నా

విశాలాంధ్ర–తాడిపత్రి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య అధ్యక్షతన ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలని ధర్నా చేశారు. ముఖ్యఅతిథిగా వ్య.కా.సం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య పాల్గొన్నారు. అనంతరం తాహసిల్దార్ కే.ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 94 కుటుంబాలకు ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి మండలంలోని అక్కన్నపల్లి గ్రామ రెవెన్యూలోని 78, 79,83 సర్వే నెంబర్లలో ఒక్కొక్కరికి రెండు సెంట్ల ప్రకారం ఇండ్ల స్థలాలు ప్రభుత్వం కేటాయించింది. కానీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవడానికి మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో లబ్ధిదారులు స్వయంగా ఇల్లు నిర్మించుకోలేక పోతున్నారని,. అధికారులు క్షేత్ర పరిశీలించి మౌలిక వసతులు కల్పి లబ్ధి దారులు ఇల్లు నిర్మించుకుంటారని చెప్పారు. లేనిపక్షంలో ఉద్య మాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యకాసం నియోజకవర్గ అధ్యక్షుడు అధ్యక్షుడు ఎ.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, స్థల లబ్ధిదారులు రామలక్ష్మి, వరాలు, మంగమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర–ఉరవకొండ: సీపీఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో పార్టీ నియోజకవర్గం కార్యదర్శి జే.మల్లికార్జున ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేస్తున్న సిపిఐ పార్టీ బలోపేతానికి సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి పార్టీ నిర్మాణానికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాములు, ఎర్రి స్వామి, నరసింహులు, పెన్నోబిలిసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

విశాలాంధ్ర–ఉరవకొండ: వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం ఉరవకొండలో శ్రీ వాణి విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి రోజు అక్షరాభ్యాసం చేసుకుంటే చదువుల్లో ముందుంటారని ప్రగాఢ విశ్వాసాన్ని అర్చకులు తెలియజేశారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించాలని సరస్వతి అమ్మవారికి మొక్కుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ రఘు రాములు, హెచ్ఎంశ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

విశాలాంధ్ర–రాప్తాడు: వసంత పంచమి సందర్భంగా బుధవారం హంపాపురం సమీపంలో ఉన్న శ్రీ వెంకటే శ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సరస్వతిదేవి పూజ నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.విష్ణువర్ధన్ , కళాశాల సీఈఓ ఆనంద్ కుమార్, ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం "సభను అడ్డుకోవడానికి సంసిద్ధం

విశాలాంధ్ర–రాయదుర్గం రూరల్: ఈనెల 18వ తేదీన రాప్తాడులో సిద్ధం సభకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఏఐవైఎఫ్, రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అడ్డుకోవడానికి సంసిద్ధంగా ఉన్నామని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రేష్ బుధవారం విలేకరుల సమావేశంలో అన్నారు. రాష్ట్రంలో 2024 డీఎస్సీలో 6వేల 100 పోస్టులకు అన్ని క్యాటగిరీలకు ఏకపక్షంగా రూ.750లు ఆన్‌లైన్ ఫీజు పెంచాదని వ్యతిరేకిస్తున్న మన్నారు. పరీక్షా సమయాన్ని 30 రోజులకే కుదించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి పరీక్షకు 90 రోజులు సమయం ఇవ్వాల్సి ఉండగా 30 రోజుల సమయాన్ని కేటాయించడంతో నిరుద్యోగులు ఒత్తిడితో, ప్రాణాలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి సిద్ధపడుతున్నారని అన్నారు. 117 జీవోను రద్దు చేయాలని, అప్రెంటిస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేరుస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి రాష్ట్రంలో ఉన్న 15 లక్షల నిరుద్యోగుల జీవితాలతో నాలుగున్నర ఏళ్ళు గాఆడుకుంటున్నారన్నారు. అరకొరగా ఉద్యోగాలు వదులుతూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ కూడా కంటికి కనిపించడం లేదన్నారు. దేనికి సిద్ధం జగనన్న అని ప్రశ్నించారు. పీఈటీ పోస్టులో అభ్యర్థులు దాదాపు 85 వేల మందికి ఎక్కడ కూడా ఒక పోస్ట్ భర్తీ చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో తాలూకా కార్యవర్గ సభ్యులు యోగేంద్ర, నాయకులు దినాకర్, తేజ,మాధవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తులు కాపాడండి

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన పబ్లిక్ స్థలాలను కొందరు వ్యక్తులు ఆక్రమించుకొన్నారని వాటన్నింటినీ కూడా గ్రామపంచాయతీ అధికారులు కాపాడాలని మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన వార్డ్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మీనుగా లలిత అధ్యక్షతన పంచాయతీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో పబ్లిక్ స్థలాలను గుర్తించి వాటికి తక్షణమే కంచె వేయాలన్నారు. ఇప్పటికే పంచాయతీ స్థలాలు అమ్ముకున్న వారిపైన ఆక్రమించుకున్న వారి పైన కేసులు నమోదు చేయాలన్నారు. జల జీవన్ మిషన్ కింద పైపులు నిర్మాణం వేసిన తర్వాత రోడ్డున తవ్వి అలాగే వదిలేస్తున్నారని దీనివల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిగేటప్పుడు వార్డు సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించడం లేదని వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి ఖర్చులకు సంబంధించి బిల్లులు విపరీతంగా పెట్టడాన్ని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాగునీరు పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గౌససాహెబ్ పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి..

విశాలాంధ్ర–తాడపత్రి: పట్టణంలోని నెహ్రూ పార్క్ లో బుధవారం సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో రైతులు తమ హక్కుల కోసం నిరసనలు చేస్తూ ఉంటే అత్యంత క్రూరంగా రైతులను నిరసన చేయకుండా నిరోధించాలని రైతులపై పొగ బాంబులు, జల ఫిరంగులు, రహదారులకు అడ్డంగా సిమెంటు గ్రిడ్లు, ముళ్లకంచెలు వేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు జరపకుండా మోసగిస్తున్నది. వ్యవసాయం, పరిశ్రమలు, గనులను, విద్యుత్ ,అటవీ సంపదను, రవాణా, బ్యాంకులు తదితర ప్రభుత్వ సంస్థలన్నిటిని ప్రధాని మోడీ ఆదాని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తోంది. అందుకోసం బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన గ్రామీణ బంద్‌కు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నారు. ఈ బంద్ కు కార్మిక, ప్రజా సంఘాలు, రైతులు, రైతు సంఘం నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో రజక వృత్తి దారుల సమైక్య సంఘం పట్టణ కార్య దర్శి సాలవేముల సూరి ఏఐటియుసి నాయకులు రమణ, ఉమాగౌడ్ నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా కిషోర్ చౌదరి

విశాలాంధ్ర–కణేకల్లు: ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు చల్లా కిషోర్ చౌదరి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యా యులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీ, ఫుల్ టైమ్ వర్కర్స్ పని చేస్తున్నారు. ఈ వర్గానికి చెందిన ప్రతి ఉద్యోగికి ఆర్థిక , ఆర్థికేతర సమస్యలు ఉన్నాయి. 12వ పిఆర్సి కమీషన్ వేసినప్పటికీ నేటికీ ఏ మాత్రం ప్రగతి లే దు అన్నారు. సంఘాలతో చర్చించి, జిల్లాల పర్యటనలు, ఉద్యోగుల నుండి సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించుటకు చాలా గడువు కావాల్సి వుంటుంది. 01.07.2023 నుండి 12వ పీఆర్‌సీ అమలు చేయాలని. విపరీతంగా ధరలు. పెరిగిపోయాయి.. తక్షణమే మధ్యంతర భృతి (ఐ.ఆర్) 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులు తమ సొంత డబ్బును సబ్స్క్రిప్షన్‌గా కడుతూ వి.యఫ్. ఏపి జియల్ఐ లోన్స్, పార్ట్ ఫైనల్స్ దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ

విశాలాంధ్ర–శింగనమల: బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామంలో బుధవారం నూతనంగా ఏర్పాటుచేయనున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ముక్కోటి అంబిక సేవా చారిట బుల్ ట్రస్ట్ అధినేత దంపెట్ల శివ భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహ నిర్వహణ గురించి చెర్లోపల్లి కాలనీలోని ముఖ్యమైన పెద్దలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, ప్రజా సమాఖ్య అధ్యక్షుడు మద్దలచెరువు మల్లి,హ్యాండ్ బాల్ సెక్రటరీ శివశంకర్, చెర్లోపల్లిపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన సీఎం జగన్

-బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్

విశాలాంధ్ర–ఉరవకొండ : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడని దాచుకోవడం, దోచుకోవడమే పాలన కొన సాగుతున్నదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్య కుమార్ అన్నారు. బుధవారం ఉరవకొండలో స్థానిక టవర్ క్లాక్ సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతన్నలకు మోదీ అండగా ఉంటే... జగన్ మాత్రం వారి ఆత్మహత్యలకు కారణం అయ్యారన్నారని ఆరోపించారు. మోదీ నేరుగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేశారన్నారు. ఏపీలో మాత్రం డబ్బులు ఇస్తామని రైతులకు మొండిచేయి చూపారని పేర్కొన్నారు. బటన్ నొక్కి జగన్ మాయలు చేసేవాడని.. డబ్బులు నిజంగా పడినట్లు అధికారులు, అనుచరులు నటించే వారని తెలిపారు. ఈ మోసం గుర్తించే కేంద్రం ముందుగానే రైతు ఖాతాల్లో డబ్బు వేసిందన్నారు. అయినా మళ్లీ అదే డ్రామాను జగన్ అండ్ కో రక్తి కట్టించారన్నారు. ఇప్పటికీ రాష్ట్ర వాటాగా జగన్ రైతులకు బీమా సొమ్ము కట్టలేదన్నారు. పంట పెట్టుబడి రాయితీ అని ఇటీవలే జగన్ మరోసారి మోసం చేశారన్నారు. యాంత్రీకరణ కింద కేంద్రం యాభై శాతం సబ్సిడీ ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పరికరాలను కొనుగోలు చేయకుండా రైతులను వంచించిందన్నారు. జలకళ పేరుతో హడావుడి చేసి.. వెలవెల బోయేలా చేశారన్నారు. పంట నష్టం పరిశీలనకు కూడా పొలంలో కాలు పెట్టకుండా చూడటం జగన్‌కే చెల్లిందన్నారు.రైతుల ఆత్మహత్యల్లో దేశంలో ఏపీ మూడో స్థానంలో ఉందంటే జగన్ సిగ్గు పడాలని సత్యకుమార్ అన్నారు. బీజేపీ నాయకులు ఇంద్రావతి సురేంద్ర, ఆ పార్టీ జిల్లా నాయకులు సంధి రెడ్డి శ్రీనివాసులు, లలిత్ కుమార్‌పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అధిక సంఖ్యలో ఇళ్ల స్థలాలు లేని పేదలు

- రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటమే తప్ప.. నిజమైన పేదలకు స్థలాలు ఇవ్వలేదు
- ఏపీ వ్యకా.సం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-గోరంట్ల : గోరంట్ల మండలం భూదిలి గ్రామంలో సర్వే నెంబర్ 726/6 నందు 4 ఎకరాల 20 సెంట్లు ప్రభుత్వ భూమిని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపోరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర కార్యదర్శి బి.కేశవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ భూపోరాట కార్యక్రమం పుట్టపర్తి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు నాయకత్వంలో నిర్వహించారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 32 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నదని, కాని ఆచరణలో ఇళ్ల స్థలాలు లేని పేదలు వందలాది మంది అధిక సంఖ్యలో మిగిలిపోయారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 32 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చి ఉంటే,ఇళ్ల స్థలాలు కోసం పేదలు మా భూపోరాట కార్యక్రమంలో వేలమంది ఎందుకు పాల్గొంటున్నారని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిజమైన పేదలకు ఇళ్ల స్థలాలు దక్కలేదన్నారు. గోరంట్ల మండలం భూదిలి, చింతలపల్లి, గంగమ్మ పల్లితండ, గోరంట్ల, గుమ్మయ్య గారి పల్లె, నర్సింపల్లి గ్రామాల్లో కూలీ పనులకు పోయే మహిళలు మాకు ఇప్పటి వరకు ఇంటి స్థలాలే లేవని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ముందు గోడు వెళ్ళ బోసుకున్నారని తెలియజేశారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేస్తే పేదలకు సాగు భూములు, ఇళ్ల స్థలాలు దక్కుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములు ఎక్కడ వున్నా వాటిని గుర్తించి ఎర్ర జెండాలు పాతి పేదలకు పంచుతామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పి పేదలను మోసం చేస్తున్నదన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.కేశవ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అనేక భూపోరాటాలు చేశామని, అన్ని చోట్లా పేదలు నివాసం ఉంటున్నరన్నారు. పేదలు ఇళ్ల స్థలాలు, సాగుభూముల కోసం భూపోరాటాల్లో పాల్గొనాలని కోరారు. ఈ ప్రాంతంలో యమ్ ఎమ్మెల్యేలు పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని, అ పారిశ్రామికవేత్తలకు మాత్రం వేలాది ఎకరాలు అప్పచెబుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటనారాయణ, జి.కిష్టన్న, కేకుమార్, నాగరాజు, శంకర, నరసింహులు, అంజి ఈ భూపాలుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, బి.కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, వెంకటనారాయణ, బాలస్వామిలు భూమిలో జెండాలు పాతికంప చెట్లు తొలగించారు.

గ్రామీణ కార్మిక బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తనకల్లు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘాల తీర్పు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రామీణ కార్మిక బందు జయప్రదం చేయాలని మండల భారత కమ్యూనిస్టు పార్టీ మండల కన్వీనర్ రెడ్డప్ప, రైతు సంఘం నాయకులు ఇక్బాల్, చౌడప్ప, కరీముల్లాలు పిలుపునిచ్చారు. రైతు పంటకు గిట్టు ధర కల్పించాలని కేరళ రాష్ట్రంలో రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతు విముక్తి చట్టాన్ని అమలు పరచాలని ప్రతి రైతుకు పంట సహాయం అందించాలని, బ్యాంకుల్లో ఉన్న రుణాలన్నిటిని మాఫీ చేసి రీ షెడ్యూల్ రుణాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో రైతుల కోసం కార్మికుల కోసం కర్షకుల కోసం ఈనెల 16న రాష్ట్ర బందు చేపడుతున్నామని తెలిపారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు పెన్షన్ ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ ప్రకారం భూమిలేని రైతులకు భూ పంపిణీ చేపట్టాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ ఆపాలని, రైతు మీటర్లకు మోటర్లు బిగించే ప్రక్రియను ఆపాలని, ఎన్నో ప్రాణ త్యాగాల తర్వాత సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశారని, వాటిని పునరుద్ధరించాలన్నది ఈ బంద్ ముఖ్య ఉద్దేశం అన్నారు. రైతులు కార్మికులు కర్షకులు బందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో నిలవాలన్నదే జగన్ ఆకాంక్ష

పుట్టపర్తి ఎమ్మెల్యే దిద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : మహిళలు ఆత్మస్థైర్యంతో బతకాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష అని ఎమ్మెల్యే దిద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో నాలుగవ విడత డాక్టర్ వైయస్సార్ ఆసరా కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూతనందించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, డ్వాక్రా మహిళలకు ఉన్న 27,600 వేల కోట్లు అప్పును మాఫీ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నాలుగో విడత పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు 2363 మహిళా సంఘాలకు 23,311 మంది సభ్యులకు 18.52 కోట్లు మంజూరు అయిందన్నారు. ఒక్కొక్క సభ్యురాలికి 15000 ప్రకారం ఇప్పటికీ నాలుగు విడతల్లో అందించడం జరుగుతోందన్నారు. అమ్మ ఒడి, ఆసరా, విద్యా కానుక, చేయూత తదితర ఎన్నో పథకాలు మహిళల పేరుపై మంజూరవుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.750 కోట్లతో 26 వేల ఇల్లు నిర్మిస్తున్నామని, 864 కోట్లతో 193 చెరువులకు సాగునీటికి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న, పుడా చైర్పర్సన్ లక్ష్మీ నరసమ్మ, మూడు మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయి లీలారెడ్డి, ఆవుటాల రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు వాహనదారులకు సేవలు సులభతరం అవుతాయి..

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్షన్ కార్యాలయం ఏర్పాటుతో ప్రజలకు వాహనదారులకు సేవలు సులభతరం అవుతాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులో ఎంవిఐ కార్యాలయాన్ని కేతిరెడ్డి ప్రారంభించారు. తదుపరి రవాణా శాఖ ఉన్నతాధికారులు జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి,ఎంవీఐ వరప్రసాద్ శివప్రసాదులచే ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మవరం డివిజన్లో ఎన్.వి.ఐ కార్యాలయం ఏర్పాటు కోసం ప్రజలు ఏళ్ల తరబడి వేచి చూడడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు ఈ కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ వాహనాల రిజిస్ట్రేషన్ వాటికి వెళ్లాలంటే ఆర్టీవో కార్యాలయం కదిరిలో ఉండటం వలన చాలా దూరం ప్రయాణించాల్సి ఉండేదని తెలిపారు. ప్రజలు వాహనదారుల దృష్టిలో ఉంచుకొని తాను ప్రభుత్వంతో చర్చించి ఈ అవకాశాన్ని కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సహకరించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత వారంలో బుధవారం, శుక్రవారంలో వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రెన్యువల్, వాహనాల రిజిస్ట్రేషన్, వాహనాల ఎఫ్సిలతోపాటు పలు సేవలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డితో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలుపాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను రవాణా చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోండి..

ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు పరిమితికి మించి అధిక సంఖ్యలో విద్యార్థులను పాఠశాలలకు బస్సులలో పంపడంలో ప్రమాదాలు జరుగుతాయని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య, జిల్లా అధ్యక్షులు జగదీష్ వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో నడుపుతున్న బస్సులకు అన్ని పర్మిట్లు ఉన్నాయా? లేదా? బస్సు కండిషన్ ఎలా ఉంది?, ప్రతి బస్సుకు స్పీడోమీటర్, ప్రతి డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా అని విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ జిల్లా కార్యదర్శి సాయికిరణ్, ఉపాధ్యక్షులు జైపాల్, యాసిన్, గణేష్, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించండి..

విశాలాంధ్ర-ధర్మవరం: దీర్ఘకాలికంగా ఉన్న మున్సిపల్ వర్కర్ సమస్యలను పరిష్కరించాలని, కార్మికులు పడుతున్న కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ సిఐటియు నాయకులు కమిషనర్ రాముకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ షరతులు లేకుండా సమ్మె కాలం జీతాన్ని క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్స్, నాన్ పిహెచ్ వర్కర్స్, లతోపాటు కోవిడ్, వరదలు, కొత్తగా తీసుకున్నవారు, క్రాఫ్ట్ డ్రైవర్లు, ఎంఎంఆర్లకు వెంటనే చెల్లించాలని, వేతనాలు రూ. 21 వేల నుండి రూ.24,500 వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్, ఎక్స్‌గ్రేషియా బట్టి ఖర్చులు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, ఎకౌంట్లకు సంబంధించిన జీవోలను జారీ చేయాలని, వేయి రూపాయలు కానుక, స్కూల్ స్లిప్పర్స్, బకాయి జీతాలు చెల్లింపులకు సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు 18,500 జీతం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, బాలాజీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాబు, ముకుంద, ప్రసాద్ లతోపాటు చెన్నకేశవులు ఓబులప్ప, చంద్రశేఖర్, ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు అద్ర మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవిని కలిసిన ఇటికేపల్లి నాగరాజ్ ...

విశాలాంధ్ర-గుడిబండ: మండలానికి చెందిన ఇటికేపల్లి నాగరాజ్ మెగాస్టార్ చిరంజీవి యువత మండల అధ్యక్షుడిగా పనిచేస్తూ ఇటీవల మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం భారతదేశ రెండవ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ అవార్డును చిరంజీవికి ప్రకటించిన విజయం అందరికీ తెలిసినదే అందులో భాగంగా మంగళవారం హైదరాబాదులోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో మండలం చిరంజీవి యువత అధ్యక్షుడు ఇటికేపల్లి నాగరాజ్ కలిసి మడకశిర మెగా అభిమానుల తరుపున ధన్యవాదాలు తెలిపినట్లు తెలిపారు. ఈ క్రమంలో రక్తదానం చేస్తున్న, చేయిస్తున్న వారిని మెగాస్టార్ చిరంజీవి అభినందించినట్లు పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీలో 30 కుటుంబాలు చేరిక..

విశాలాంధ్ర-కొత్తచెరువు : మండలం పరిధిలోని మైలేపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. వైసిపి ప్రభుత్వ పాలనలో విసిగిపోయిన వీరు నారా చంద్రబాబునాయుడు మరియు పల్లె రఘునాథ్ రెడ్డి నాయకత్వం మీద నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలియజేశారు. బుధవారం నాడు పుట్టపర్తిలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె వీరికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, అన్ని వర్గాల వారికి సమానమైన న్యాయం తెలుగుదేశం పార్టీతో సాధ్యమని, అందుకే నాయకులు నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. కొత్త పాత తేడా లేకుండా అందరూ ఒక కుటుంబంలా కలిసి పనిచేసే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని పల్లె సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, కేసప్ప, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తాం : భువనేశ్వరి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తామని, చేనేత ముడిసరికి పై సబ్సిడీతో పాటు 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్తును ఇస్తామని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ధర్మవరంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. నేరుగా మహిళా చేనేత కార్మికులతో మారుతీ రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపంలో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల కురుక్షేత్రంలో మహిళలు తమదైన పాత్ర పోషించాలని, ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, మృతి చెందిన కుటుంబాలకు పూర్తి దశలో ప్రభుత్వం ఆదుకోకపోవడం దారుణమని తెలిపారు. మహిళా చేనేత కార్మికులకు అండగా ఉంటానన్నారు. ధర్మవరం పర్యటనలో తనకు ప్రజలు ఇంతటి అపూర్వ స్వాగతం ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. చేనేతలకు ప్రమోట్ చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ముందుగా సంజీవపురం గ్రామంలో మృతి చెందిన కార్యకర్త చక్కెరప్ప కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో ధైర్యంగా పోరాడిన కార్యకర్తలు ఆవేదనతో చనిపోయిన కార్యకర్తల నుంచి నిజం గెలవాలి అనే కార్యక్రమం పుట్టింది అన్నారు. న్యాయం కోసమే తాను రాష్ట్ర పర్యటన చేస్తున్నానని తెలిపారు. చేనేత కార్మికులు చేనేత పరిశ్రమలో వాడే పరికరాలు ముడి పదార్థాలను భువనేశ్వరికి చూపించారు. వస్త్రాలను ఎలా తయారు చేస్తారో వివరించారు. అనంతరం మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ నారా భువనేశ్వరి పర్యటన పార్టీ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, బండారు శ్రావణి, పనికుమార్, పెనుకొండ సవిత, పరిసే సుధాకర్, మహేష్ చౌదరి, అంబటి సనత్, మారుతిస్వామి, బోయ రవిచంద్ర, నాయకులు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మీ సహకారం మరువలేము

విశాలాంధ్ర-బత్తలపల్లి: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు నమోదు చేసి 53 రోజులపాటు సబ్ జైల్లో గడపగా ప్రజలందరూ స్వచ్ఛందంగా రోడ్లెక్కి నిరసన తెలిపి మా కుటుంబానికి అండగా నిలిచారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్న సమయంలో మనస్థాపం చెంది బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామంలో ముల్లగూరి వెంకటరాముడు, చెక్కరయ్య మృతి చెందారు. బుధవారం ఇక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకటరాముడు భార్య కుళ్లాయమ్మకు, సాకే నీలమ్మకు రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం చెక్కు అందించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆడ మగ అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కూడా రోడ్డెక్కి మా బాబును వదలాలని నిరసన తెలియజేయడం నాకెంతో సంతోషాన్ని నింపింది అన్నారు. నేను దేనికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ఓటుతోనే వైకాపా ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం శింగనమల నియోజకవర్గాల బాధ్యులు పరిటాల శ్రీరామ్, బండారు శ్రావణి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ కుమార్, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, క్లస్టర్లు కన్వీనర్లు నెట్టెం రమణ, సురేందర్ నాయుడు, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, జక్కంపూటి నాగభూషణ, చిత్రానాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో దర్గా పేటకు చెందిన రహీం చనిపోవడంతో బుధవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి నిజం గెలవాలని నినాదంతో 3 లక్షల రూపాయలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పార్థసారధి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పాల్గొన్నారు.

నేడు దిన్నెహట్టిలో..

విశాలాంధ్ర-అగళి: గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి విచ్చేస్తున్న నారా భువనేశ్వరి కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలిరావాలని జడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమార్స్వామి పిలుపునిచ్చారు. దీన్నేహట్టిలో మృతి చెందిన ముత్తప్ప కుటుంబాన్ని ఉదయం 10 గంటలకు పరామర్శిస్తారన్నారు.

విద్యుత్ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోండి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని మార్కెట్ యార్డు సబ్ స్టేషన్ యందు ఈనెల 16వ తేదీ ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు నిర్వహించనున్న ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్- అనంతపురం రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేవి. రమేష్ పేర్కొన్నారు. ఈ విద్యుత్ అవగాహన సదస్సుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార కానీ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియపరిచి, సమస్యలను పరిష్కరించుకొని చక్కటి అవకాశం ఉందని తెలిపారు.

శుభకార్యాలయాల్లో పాల్గొన్న రఘువీరారెడ్డి ...

విశాలాంధ్ర-రొళ్ల: మాజీ మంత్రి, మాజీ ఏపీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సిడబ్ల్యూసి సభ్యులు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జడ్పిటిసి సభ్యుడు బి.అనంతరాజు, ఇరు పార్టీకి చెందిన నాయుకులు విడివిడిగా పలు శుభ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోళ్ళకొండ గ్రామంలో నరసింహప్ప కోడలు దివ్య శ్రీమంతం కార్యక్రమానికి స్థానిక లక్ష్మి ప్యాలెస్‌లో జరిగిన వన్నార్లహళ్లి ప్రకాష్ కూతురు మౌనిక వివాహ వేడుకల్లో హాజరయ్యారు. వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎం.గోవిందయ్య శెట్టి నూతనంగా నిర్మించిన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు దాసిరెడ్డి, టిఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌడప్ప, గుడిబండ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగరాజు.అగళి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకేష్.కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు అన్వర్, తెదేపా నియోజకవర్గ అధ్యక్షుడు బాలకృష్ణ, మాజీ జెడ్పిటిసి సన్నతిమ్మప్ప పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠలో రఘువీర

విశాలాంధ్ర-గుడిబండ: మండలం లోని జంబలబండలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, గుడిబండ గ్రామాలలో శ్రీ అయ్యప్ప స్వామి, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో సిడబ్ల్యూసి సభ్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి పాల్గొన్నారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో దైవభక్తితో మెలగాలని కోరారు. కార్యక్రమంలో గుడిబండ సర్పంచ్ కరుణాకర్ గౌడ్, జిల్లా కిషన్ సెల్ అధ్యక్షుడు మాజీ సింగల్ విండో అధ్యక్షుడు వరదరాజు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ నాగభూషణ్, మాజీ ఎంపీటీసీ శశిధర్, తదితర శ్రీ అయ్యప్ప స్వామి భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి..

విశాలాంధ్ర-గుడిబండ: తెలుగుదేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం గుడిబండ మండలంలోని దిన్నేహట్టి గ్రామానికి చెందిన వట్టే ముత్తన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి నిజం గెలవాలి పేరిట పర్యటన చేస్తున్నట్లు తెదేపా జిల్లా ఎస్సీ సెల్ మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును జీవించుకోలేక గుడిబండ మండల పరిధిలోని దీన్నేహట్టి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ముత్తప్ప అనే కార్యకర్త గుండెపోటుతో మరణించాడు. ఈ క్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరిట చేస్తున్న యాత్రలో భాగంగా గురువారం ముత్తప్ప కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. కావున నారా భువనేశ్వరి పర్యటనలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు శివ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రణవసాయి ప్రైవేటు ప్రైవేట్ స్కూలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. క్వాలిఫైడ్ లేని టీచంతో బోధిస్తున్నారని, అధిక ఫీజులు కూడా వసూలు చేయడం సరైన పద్ధతి కాదని, వెంటనే ప్రణవసాయితో పాటు వివిధ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు గైకొనాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు ప్రదీప్, రాజా, మహేష్, ప్రవీణ్, పవన్ ఉన్నారు.

షేర్ మార్కెట్ పెట్టుబడిపై అవగాహన పెంచుకోండి..

విశాలాంధ్ర-ధర్మవరం: షేర్ మార్కెట్ పెట్టుబడిపై విద్యార్థులకు చక్కటి అవగాహన సదస్సును నిర్వహించామని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కే.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, వక్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కామర్స్ విభాగం పుష్పావతి ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించామని తెలిపారు. విద్యార్థి దశ నుండి పెట్టుబడి పెట్టడం వలన విద్యార్థులకు చక్కటి అవగాహన పెంపొందించుకుంటారని తెలిపారు. డిజిటల్ మార్కెట్ వాటాలలో, డిఫెన్స్ లలో, మార్కెట్ బుల్ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టడం ద్వారా, తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి, అధ్యాపకులు కిరణ్ కుమార్, షమీవుల్ల, చిట్టెమ్మ, గోపాల్ నాయక్, భువనేశ్వరి, సరస్వతి, ఆనందు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాయినగర్‌లో గల సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా మూడు సంవత్సరాల నుండి ఐదేళ్ల విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం నరేంద్రబాబు తెలిపారు. వసంత పంచమి రోజు సరస్వతి దేవిని పూజించడం వల్ల ప్రతి రంగంలో విజయం లభిస్తుందని తెలిపారు. బాసరలో కొన్ని లక్షల మంది పిల్లలకు నేడు అక్షరాభ్యాసం జరుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళావతి, ప్రభావతి, జ్యోతి, హేమ, సునీత, సుమియా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీబీ పట్టణంలోని కాగితాల వీధిలో గల ప్రణవ సాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో వసంత పంచమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. చిన్నారులకు అక్షరాభాష కార్యక్రమాన్ని అర్చకులు ద్వారా నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం ఆదిలక్ష్మి మాట్లాడుతూ సరస్వతి దేవుని పూజిస్తే భవిష్యత్తులో చదువుకు మంచి విజయవంతం అవుతుందని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 15,ఫిబ్రవరి 2024

ఇబ్బందుల్లో ఖాతాదారులు

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల కేంద్రంలోని కెనరా, బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నప్పటికీ వాటికి ఏటీఎం గదులు అలంకారప్రాయంగా మాత్రమే ఉన్నాయి.. వందలాదిమంది మండల ప్రజలు లేపాక్షి వెళ్లే టూరిస్టులు రిజిస్ట్రేషన్లు కోసం వచ్చే పలువురు బ్యాంకుల ఖాతాదారులు అత్యవసరంగా డబ్బు కోసం వస్తే ఆ గదులను చూసి వెనుతిరిగి వెళ్తున్న సంఘటనలు కొకొల్లు చోటు చేసుకున్నాయి ఈ రెండు బ్యాంకులలో మండల ప్రజలు దాదాపుగా 40 వేలు మంది దాకా ఖాతాలు తెరిచినట్లు సమాచారం దీంతో చాలామంది ఏటీఎం కు అలవాటు పడి ఉన్నవారే ఈ నేపథ్యంలో కెనరా బ్యాంక్ వారు దాదాపుగా గత మూడు సంవత్సరముల నుండి ఏటీఎం నిలుపుదల చేశారు కానీ ఆ ఏటీఎం గదికి మాత్రం ప్రతి నెల రూ4200 చెల్లిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నట్లు సమాచారం అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు గత మూడు నెలల క్రితం ఇక్కడ ఉన్న ఏటీఎం ను తీసేసి పెనుగొండ కియా సమస్త వద్దకు తరలించారని సమాచారం దీంతో ఖాతాదా రులు పలు రకాలుగా ఇబ్బందులు పాలవుతున్న తరుణంలో ఇదే అదునుగా ప్రైవేట్ వ్యక్తులు బ్యాంకు ఖాతాదారులకు ఆధార్ కార్డుల ద్వారా, ఏటీఎం కార్డుల ద్వారా అమౌంట్ చెల్లిస్తూ ఇష్టారాజ్యంగా అదనపు లాభాలు పొందుతున్నారని వినికిడి. మరికొందరు ఖాతాదారులు ఇతర ఏటీఎంలలో అమౌంట్ డ్రా చేసుకోవడంతో చార్జీల మోత పడడంతో లబో దిబోమంటున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఏటీఎంలో అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్ లో మెరిసిన ఆణిముత్యం

విశాలాంధ్ర - ఎన్‌పికుంట : మండల పరిధిలోని అలుగుంటివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డి, సాయి ప్రసన్న దంపతుల కుమారుడు సాయి దివ్య తేజరెడ్డి జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ లో 275 మార్కులతో 99.97 పర్సంటేల్ తో జేఈఈ మెయిన్స్ లో ఉత్తీర్ణత సాధించాడు. పదవ తరగతిలో మండల కేంద్రంలోని పాఠశాలలో చదివి 580 మార్కులతో ఉత్తీర్ణత సాధించి మండల టాపరుగా నిలిచారు.ఈ సందర్భంగా మండల ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి,యస్ టి యు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలుపుతూ భవిష్య త్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన సాయి దివ్య తేజరెడ్డికి మండల ఉపాధ్యాయులు ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

రాప్తాడుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీని ప్రకటించే ధైర్యం ఉందా..?

జనసేన ఇంచార్జి సాకే పవన్ కుమార్

విశాలాంధ్ర - రాప్తాడు : వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరపున రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేటాయించగలరా అని జనసేన రాప్తాడు ఇంచార్జి సాకే పవన్ కుమార్ సీఎం జగన్ ను ప్రశ్నించారు. బుధవారం ఆయన రాప్తాడులో విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ నిత్యం పలికే సామాజిక న్యాయం అనే పదానికి వైసీపీ హయాంలో చోటే లేదన్నారు. బీసీలకు ఏమి ఉద్ధరించారని రాప్తాడులో సిద్ధం సభకు వస్తున్నారని నిలదీశారు. రాప్తాడు నియోజకవర్గంలో 70శాతం బీసీలున్నారనే ఉద్దేశ్యంతోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో వాల్మీకి సామాజిక వర్గానికి తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇచ్చి సామాజిక న్యాయాన్ని పాటించారన్నారు. రాష్ట్రం లో 70శాతం బీసీలున్న నియోజకవర్గాల్లో ఆ సామాజిక వర్గానికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు జగన్ హయాంలో సరైన న్యాయం జరగలేదన్నారు.నా ఎస్టీ,నాఎస్సీ,నాబీసీలని మాట్లాడుతున్నారే తప్పవారి మనోభావాలను,బాధలను ఏనాడూవిన్నారోచెప్పాల న్నారు.

అక్రమ మద్యం స్వాధీనం వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - శింగనమల : అనంతపురము ఎస్పీ ఆదేశాల మేరకు, అనంతపురము రూరల్ డిఎస్పీ పరివేక్షణ లో శింగనమల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉత్తరువుల మేరకు శింగనమల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ యం.చంద్రశేఖర్‌కు రాబడిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి శింగనమల మండలం, శింగనమల గ్రామం ఆర్.టి.సి బస్టాండ్ దగ్గర శింగనమల గ్రామానికి చెందిన అనంత హరి కృష్ణ, అను వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం అమ్ముతుం డగా అతనిని పట్టుకొని, అతని వద్ద 13 (80 ఎంఎల్) మద్యం బాటిలను సీజ్ చేసి అతనిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

రథసప్తమి వేడుకలకు ఆహ్వానం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ మండలం బూదగవి గ్రామంలోని సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 16న జరిగే రథసప్తమి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి బూదగవి గ్రామస్తులు, వైస్సా ర్సీపీ నాయకులు ఆహ్వానించారు.అనంతపురం నగరంలోని విశ్వేశ్వరరెడ్డి నివాసంలో ఎంపీపీ నరసింహులు, నాయకులు ధనుంజయ, రామాంజనేయులు,ఎర్రిస్వామి,ధనుంజయ, లింగన్న, ఆల్బిరప్ప, భక్తులు తదితరులు ఆయనను కలిసారు. ఈ సందర్భంగా సూర్య దేవాలయం జరిగే ఉత్సవ వివరాలను మాజీ ఎమ్మెల్యే కి వివరించారు. రథసప్తమి రోజున కుటుంబ సమేతంగా ఆలయానికి రావాలని స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం ఆహ్వాన పత్రికలను అందజేశారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర-పామిడి: పట్టణం పరిధిలోని 15వ వార్డు నందు టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి కాలని లో సమస్యలు తెలుసుకుంటూ, వైసిపి ప్రభుత్వ వ్యతిరేక విధాలనాలను ప్రజలకు తెలియజేస్తూ, చంద్రబాబు నాయుడు గారు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించి రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలి అంటే వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రి గా చేసుకోవాలని ప్రజలకు వివరించటం జరిగింది.ఈ కార్యక్రమం లో మాజీ టౌన్ అధ్యక్షులు, యూనిట్ ఇంచార్జ్ బొమ్మ మోహన్ కృష్ణ, బూత్ ఇంచార్జ్ చీమల రాము, షేక్ష వలి, వన్నూర్ వలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - అగళి : అగళి మండలం లోని ఇరిగేపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం లో గాయపడ్డ రోళ్ల మండలం దాసప్పపాళ్యం గ్రామానికి చెందిన చెందిన ఈరక్యతరాయప్ప (64) బెంగుళూరు లో ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎ ఎస్ ఐ శ్రీరాములు తెలిపారు. దాసప్ప పాళ్యం గ్రామానికి 26 మంది ఆదివారం ఉదయం శిర నియోజకవర్గంలోని మరడిగుడ్డ లో జరిగిన పెళ్లి కి వెళ్లి రాత్రి కి తిరుగు ప్రయాణం లో అగళి మండలం ఇరిగేపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడిన విషయం తెలిసిందే మరో ఇద్దరు ఈరక్యాతరాయప్ప నాగన్న లు తీవ్రంగా గాయ పడి విషమంగా ఉండడం తో వారిని బెంగుళూరు కు తరలించి వైద్యా చికిత్సలు అందిస్తున్నా విషయం తెలిసిందే మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎఎస్ ఐ శ్రీరాములు తెలిపారు.మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు. సాయంత్రం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రతి జాబ్ కార్డుకు వంద పని దినాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - బొమ్మనహాల్ : మండలంలోని ఆయా గ్రామపంచాయతీలలో పనులకు వచ్చే ప్రతి కూలీల ప్రతి జాబ్ కార్డుకు వంద రోజులు పనిదినాలు పూర్తిచేయాలని ఏపీఓ రమేష్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం బొమ్మనహాల్ మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీవో విజయమ్మ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ ఓ రమేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు వచ్చి కూలీల జాబు కార్డులకు ఈ ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పని దినాలు పూర్తి అయ్యేవిధంగా చూడాలని ఆయన తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎండ తీవ్రత ఉండటంవల్ల కూలీల సకాలంలో పనికి వచ్చే విధంగా కూలీలకు తెలియపరచాలని తెలిపారు. పనులు కోరే ప్రతి కూలీలకు పనులు కల్పించాలని దినసరి కూలి పడి విధంగా పనులు చేయించాలని తెలిపారు .ప్రభుత్వం నుంచి మంజూరైన గృహ నిర్మాణానికి 90 రోజులు పని దినాలు కల్పించడం జరుగుతుందని గృహ నిర్మాణ లబ్ధిదారులకు 90 రోజులు పని దినాలు త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్టికల్చర్ అధికారి కలందర్, ఉపాధి హామీ ఈసీ రాజేష్ ,ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నందు బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు న్యాయవాది హైకోర్టు శివరామకృష్ణ ఆధ్వర్యంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల నందు 10వ తరగతి చదువుతున్న బాలికలకు ఎగ్జామ్స్ పాంట్స్ అందజేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ చేతుల మీదుగా 10వ తరగతి చదువుతున్న బాలికలకు ఎగ్జామ్స్ పాడ్స్ అందజేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శిరవికుమార్, రోద్దం బాబు ప్రసాద్, హనుమంతు, నరసింహులు, రామాంజనేయులు, నరసింహులు,ధనుంజయ్ ,లక్ష్మణ నాయక్ ,స్కూల్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

వాల్మీకి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రావతి సురేంద్ర

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి కులస్తులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రావతి సురేంద్ర అన్నారు. బుధవారం బిజెపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్ ఉరవకొండ కి వచ్చిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. జాతీయ కార్యదర్శి ఆధ్వర్యంలో సురేంద్ర బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ వాల్మీకులు విద్యా, ఉద్యోగ,ఆర్థిక, రాజకీయ రంగాలలో అత్యంత వెనుకబడి ఉన్నారని ఎస్టీ జాబితాలో చేరిస్తే అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి సాధించవచ్చు అని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో వాల్మీకి కులస్తులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ కూడా రాజకీయ ప్రాధాన్యత కరువైందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని దానికి అనుగుణంగానే బిజెపి ప్రభుత్వం వాల్మీకులు ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేయాలని జాతీయ కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప విమాన గోపుర కలస ప్రతిష్ఠాపన

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలో బుధవారం మాఘ శుద్ధ పంచమి సూర్య దయాత్ పూర్వం బ్రహ్మీ ముహూర్తంలో మూల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్షేత్ర సిద్ధ గంగ మఠ అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ సిద్ధలింగమహా స్వాములు, శ్రీ క్షేత్ర సిద్ధరబెట మాట అధ్యక్షులు వీరభద్ర శివచార్యుల చేతుల మీదుగా కలశా ప్రతిష్టాపన ప్రాణ ప్రతిష్టాపన మహా పూర్ణాహుతి, శిఖర కళ స్థాపన, కదళచేదన, దేనుదర్శనము, శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విమాన గోపుర కలస ప్రతిష్టాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యావన్మంది అయ్యప్ప భక్తామండలి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించి తదనంతరం శ్రీ అయ్యప్ప స్వామి వెండి విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగింపుగా భజన కార్యక్రమాలు నిర్వహించారు.ు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ జి బి సుధాకర్, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,గుడిబండ అయ్యప్ప స్వామి భక్తామండలి సభ్యులు మండలంలోని చుట్టూ గ్రామాల ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీఎస్పీ వేణుగోపాలకు పుట్టపర్తి నియోజకవర్గ ఒడెర్లు సహకరించే ప్రసక్తే లేదు

విశాలాంధ్ర - పుట్టపర్తి : డీఎస్పీ వేణుగోపాల్ కి పుట్టపర్తి నియోజకవర్గ టికెట్ ఇస్తే వడ్డెర్ల సహకరించే ప్రసక్తే లేదని వడ్డెర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో వడ్డెర సాధికార కమిటీ సభ్యులు తీర్మానం చేశారు.ఈ సందర్భంగా వడ్డెరల సంగం నాయకులు మాట్లాడుతూ డీఎస్పీ వేణు గోపాల్ అకారణంగా ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాకు టికెట్ వస్తుందని దుష్ప్రచారం చేయడం. మంచిది కాదన్నారు. కడప జిల్లా నీకు నియోజకవర్గంలో ఎన్ని మండలాలు ఎన్ని పంచాయితీలు, ఇదేమైనా బస్ టికెట్ లేక రైల్ టికెట్ ఆ నీ మీద అనేకమైన ఆరోపణలు ఉన్నాయన్నారు. వడ్డెర కులాన్ని అడ్డుపెట్టుకొని వైసీపీని ఢీకొట్టే శక్తి సామర్థ్యాలు ఈయనకు లేవన్నారు.పుట్టపర్తిలో విధులు నిర్వహిస్తున్నప్పుడు వడ్డెర అని చెప్పుకోవడానికి కూడా నామూషి పడ్డావని, పవడ్డెర్లపై ప్రేమ పుట్టుకొచ్చిందా అన్నారు. గతంలో అనేక అవినీతి ఆరోపణలు ఈయనపై ఉన్నాయని,బనగానపల్లెలో దొంగ నోట్లు మార్పిడి కేసులో నిందితులకు సహకరించాడని,కడపజిల్లాలో మిల్లర్ల నుండి వసూళ్లకు పాల్పడ్డాడని,కలియుగ ప్రత్యక్షమైన తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో టికెట్లు తారుమారు చేసి వాటిని కూడా అమ్ముకున్నాడని,ఇలా ఎక్కడ చూసినా అక్రమాలేనని,ఇలాంటి వ్యక్తి అయిన నీవు పవిత్రమైన పుట్టపర్తి టికెట్ ఆశించడానికి అనర్హుడు అన్నారు అన్నారు. డీఎస్పీ వేణుగోపాలకు పుట్టపర్తి నియోజకవర్గం వడ్డెర్లు ఎవరు కూడా సహకరించే ప్రసక్తే లేదని,ఎవరైనా స్థానికులకు ఇస్తే సహకరిస్తామని వడ్డెర సాధికార కమిటీ తీర్మానం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో. వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు వలిపి శ్రీనివాసులు, ఆమడగురు వడ్డెర ప్రధాన కార్యదర్శి రమణ, మాజీ ఎంపీపీ రామచంద్రప్ప, ప్రసాదు, రాష్ట్ర వడ్డెర కార్యదర్శి అంజనప్ప, ఒడిసి మండలం వడ్డెర ప్రధాన కార్యదర్శి, పీటల్ సుధాకర, ఎల్‌ఐసి నర్సింలు, అల్లుకుంట్ల పెద్దన్న, వెంకట్ నారాయణ, కుంచపు వెంకటేష్, నాగరాజు, రామంజి, నల్లమాడ శంకర్, వంకర కుంట పల్లా శీన, తులసి, అంజి, పెద్దన్న, నడిపి పెద్దన్న, నాగేంద్ర, మల్లపు చిన్న పెద్దన్న, ఓబులప్ప, మరియు వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

బహుజన చైతన్య వేదిక సభ్యులు బార్ అసోసియేషన్ అధ్యక్షునికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజును బుధవారం బహుజన చైతన్య అధ్యక్షులు శివరామకృష్ణ మరియు సభ్యులు ఆధ్వర్యంలో న్యాయవాదుల సమావేశ భవనం నందు న్యాయవాదుల సమక్షంలో నాగరాజును ఘనంగా సన్మానించారు ఆయన గత ఆదివారం 11వ తేదీన బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో సామాజిక ఐక్యత సభలో పాల్గొన్నందుకు ఈ సన్మానం నిర్వహిస్తున్నామని ఆయన యొక్క విలువైన సమయాన్ని బహుజన చైతన్య వేదిక కు కేటాయించి తన అమూల్య మైన సలహాలను సూచనలను చేసినందుకు బహుజనుల కోసం ఎంతగానో కష్టపడుతున్నందుకు ఈ చిరు సన్మానం చేస్తున్నామని అధ్యక్షులుశివరామకృష్ణ తెలిపారు ఆయన తో పాటుగా న్యాయవాదులు ,హరీష్ ,బాలాజీ, అశ్వత్ నారాయణ సుదర్శన రెడ్డి, శ్రీనివాసులు, శివశర్మ,నాగిరెడ్డి,వెంకటేశులు ,రవి, తదితరులు పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో వశిష్ట విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో వశిష్ట పాఠశాల పూర్వపు విద్యార్థి పి. లక్ష్మీ గణేష్ 2024 షెసేన్స్ -1లో 99.51 % గ్రేడింగ్ మార్కులతో మంచి ప్రతిభను చాటారు. వశిష్ట పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరస్పాండెంట్ పిట్టా శివశంకర రెడ్డి మాట్లాడు తూ... పి.లక్ష్మి గణేష్ 7 నుంచి 10వ తరగతి వరకు తమ పాఠశాలలో ఒలంపియాడ్ ప్రోగ్రామ్ శిక్షణతో విద్యను అభ్యసించాడు. జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో మంచి ప్రతిభను సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం లక్ష్మీ గణేష్ కడప బీరమ్ సుబ్బారెడ్డి జూనియర్ కళాశాలలో చదువుతున్నట్లు చెప్పారు.తనకల్లు మండలం ఉస్తినపల్లికి చెందిన లక్ష్మీ గణేష్ తల్లిదండ్రులు రైతు కుటుంబ నేపథ్యం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఫీజులతో కార్పొరేట్ విద్యను అందిస్తూ... భవిష్యత్తులో ఐఐటీ, నీట్ ద్వారా డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యేందుకు మా విద్యాసంస్థ ఫౌండేషన్ కోర్సులు ఎంతగానో ఉపయోగ పడుతున్నట్లు చెప్పారు.

గృహ ప్రవేశానికి హాజరైన చవ్వా గోపాల్ రెడ్డి, రుద్రమ నాయుడు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీకి చెందిన టిడిపి నాయకుడు, మాజీ ఎంపీటీసీ గుర్రాల రామచంద్రుడు అహ్వానం మేరకు నూతన గృహప్రవేశానికి క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, బుధవారం హాజరై బహుమతిని అందజేశారు. అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు సర్పంచ్ రామాంజి, మాజీ సర్పంచ్ రామకృష్ణ, బద్దెల రాముడు, రంగస్వామి, నరసింహులు,విజయ్, భాష తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-బత్తలపల్లి : మండల పరిధిలోని డీ.చెర్లోపల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బాబా డాక్టర్. అంబేద్కర్ విగ్రహం నూతనంగా ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేశారు. ముక్కోటి అంబికా సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివ ముఖ్య అతిథిగా పాల్గొనగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన చేత భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ శివ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడ కూడా గ్రామస్తుల సహకారం ఎంతో గొప్పది అన్నారు. ఈ విగ్రహం ఏర్పాటు త్వరగతిన పనులు పూర్తి చేసి కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం గొప్ప విషయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ప్రజా సమాఖ్య అధ్యక్షుడు మద్దెలచెరువు మల్లి, హ్యాండ్ బాల్ సెక్రెటరీ శివశంకర్, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ రథయాత్రకు స్వాగతం పలికిన ముదిగుబ్బ మండల ప్రజలు

పలు గ్రామాల్లో టెంకాయ, కర్పూరలతో,స్వాగతం పలికారు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: అయోధ్య శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం రథయాత్రకు పూలతో స్వాగతం జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ అనే నినాదంతో, భారతీయ జనతా పార్టీ అగ్రికల్చర్ రాష్ట్ర రీసెర్చ్ కో కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు పిలుపుమేరకు, బుధవారం మధ్యాహ్నం సమయం మూడు గంటల 30 నిమిషాలకు చేరుకుని ముదిగుబ్బ పాత ఊరు నుంచి స్వామివారి రథం ప్రారంభోత్సవం పెద్దమ్మ స్వామి గుడి ఆంజనేయ స్వామి గుడి మెయిన్ బజార్ నుంచి, వల్లించుర్లోపల్లి, గాండ్లవారిపల్లి, బీడీ మర్రి, గంగిరెడ్డిపల్లి,మర్తాడు, ఇందుకూరు, దొరిగ ల్లు లో స్వామి రథం పెద్ద ఎత్తున భక్తులు కాయ కర్పూరంతో స్వామివారికి ఆహ్వానం కార్యక్రమంలో, ఈనెల 21వ తారీకు కదిరిలో శ్రీ అయోధ్య సీతారాముల కళ్యాణం మహోత్సవం జరగనుంది, అందులో దాదాపు 11 మండలాల నుంచి స్వామి వారి రథయాత్ర ప్రారంభోత్సవం జరిగి, నేడు ముదిగుబ్బ మండలంలో 16.వ రోజు గ్రామాలలో సీతారాములు వారి రథం సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, భజన సంఘం వారు పల్గొని పాటలు మరియు కీర్తనలతో స్వామీ వారికి ఆహ్వానం ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అంబటి ప్రకాష్ గుప్తా, ఎస్ఎస్ఎఫ్ వెంకట్ భాజపా నాయకులు పసుపులేటి వెంకటేష్, నారాయణ స్వామి, నారాయణ, నాయుడు,రమణప్ప,వెంకట నాయుడు, శ్రీనివాసులు, నారాయణ, గంగన్న, ఆనంద్, నారాయణస్వామి, మహిళా భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని రామభక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అశ్వర్థం నారాయణస్వామి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-తాడిపత్రి: పెద్ద పప్పూరు మండలం చిన్న పప్పూరు గ్రామంలో వేసిన శ్రీ అశ్వర్థ నారాయణస్వామి, శ్రీ చక్ర భీమా లింగేశ్వర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీనివాసులు రెడ్డి అధ్వర్యంలో నిర్వహించినట్లు ఈఓ సుబ్రమణ్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత హుండీ లెక్కింపు చేయగా లక్ష 82వేల 870 రూపాయలు, తాత్కాలిక హుండీ లెక్కింపు 3లక్షల 31వేల 115 రూపాయలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త కుళాయిలను బిగించిన సర్పంచ్ దేవరాజు

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని గొల్లాపురం పంచాయతీ నందు, బుధవారం గోలపురం పంచాయతీ సర్పంచ్ దేవరాజు పంచాయతీ సెక్రెటరీ కెంచరాయప్ప గోళాపురం గ్రామంలో రక్షిత మంచి నీటి సరఫరా పాత కొళాయిల స్థానంలో, కొత్త పబ్లిక్ కులాలను బిగించారు.